క్లుప్తంగా

లంకా సూర్యనారాయణకు పురస్కారం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య గ్రంథాలయంలో శనివారం వ్యవస్థాపకుడు లంకా సూర్యనారాయణకు బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'గ్రంథాలయ బ్రహ్మ' పురస్కార ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా గుంటూరు పశ్చిమ తహసీల్దార్ టి. శ్రీనివాసరెడ్డి పాల్గొని, సూర్యనారాయణకు పురస్కారాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బండి అశోక్ రెడ్డి, సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ, కాశీపట్నం సుబ్బారావు, లైబ్రేరియన్ సుభాషిణి, పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వదిలి వెళ్లిన వృద్ధురాలికి ఆశ్రయం



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో చికిత్స కోసం వచ్చిన ఓ తల్లిని అందరూ వదిలి వెళ్లారు. ఒంటరిగా వార్డులో చికిత్స పొందుతున్న ఆమె గురించి గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టుకు ఆసుపత్రి సిబ్బంది అందించారు. దీంతో శనివారం ట్రస్టు సభ్యులు ఆమెను పొన్నూరులోని గోతాలస్వామి ఆశ్రమానికి చేర్పించారు. ఎవరికైనా అనాథలు తారసపడితే తమ దృష్టికి తీసుకు రావాలని, వారికి ఆశ్రయం కల్పిస్తామని ట్రస్టు నిర్వాహకుడు పఠాన్ అల్లాబక్షు తెలిపారు. జీజీహెచ్‌కు వచ్చే రోగుల సహాయకులకు ప్రతిరోజూ డాక్టర్ పొదిల ప్రసాద్ సూపర్‌స్పెషాలిటీ భవనం ఎదుట ఉచితంగా ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నామని తెలిపారు. గుంటూరు నగరంలో ఉచితంగా అంబులెన్సు ఏర్పాటు చేసి ఆసుపత్రుల నుంచి ఇళ్లకు, ఇళ్ల నుంచి ఆసుపత్రులకు రోగుల్ని ఉచితంగా తరలిస్తున్నామని చెప్పారు. ట్రస్టు సేవల్ని వినియోగించుకోవాలనుకునేవారు సెల్ నంబర్లు 81432224 56–9397602 553ను సంప్రదించాలని సూచించారు.

డాక్టర్ అమర్‌నాథ్‌కు అవార్డు



గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, అమర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సూరత్ అమర్‌నాథ్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.ధర్మారావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ జె.నరేష్‌బాబు ఆధ్వర్యంలో అవార్డును ఆయనకు పలువురు యూనియన్ నేతలు అందజేశారు. ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 52వ వార్షిక సదస్సు గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులో అసోసియేషన్ నేతలు డాక్టర్ అమర్‌నాథ్‌కు అవార్డును అందజేశారు. గతంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన పలు నూతన ఆవిష్కరణలతో ఆర్థోపెడిక్ బ్రాంచ్ ఖ్యాతిని ఇనుమడింప చేశారని రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ జె.నరేష్‌బాబు కొనియాడారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్స్ డాక్టర్ జి.వరప్రసాద్, డాక్టర్ వి.వి.నారాయణరావు, డాక్టర్ రమణయశస్వీ, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, డాక్టర్ కంచర్ల రాంప్రసాద్ పాల్గొన్నారు.

పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతిగా డాక్టర్ భాస్కరరావు



గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ పీడియాట్రిక్ సర్జరీ (పిల్లల శస్త్రచికిత్స) విభాగాధిపతిగా డాక్టర్ చందా భాస్కరరావు విధుల్లో చేరారు. గతంలో గుంటూరు జీజీహెచ్‌లో పనిచేసిన ఆయన్ను సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలకు బదిలీ చేసింది. అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనకు ఇటీవల ఇచ్చిన పదోన్నతుల్లో ప్రొఫెసర్ హోదా లభించింది. పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతిగా విధుల్లో చేరిన డాక్టర్ భాస్కరరావును శనివారం పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందించారు.

గైనకాలజీ ప్రొఫెసర్‌గా డాక్టర్ ఝాన్సీ వాణి

జీజీహెచ్ గైనకాలజీ ప్రొఫెసర్‌గా డాక్టర్ ఝాన్సీ వాణి శనివారం విధుల్లో చేరారు. విజయవాడలో పనిచేస్తున్న ఆమెను మ్యూచ్‌వల్ బదిలీలో భాగంగా అధికారులు గుంటూరుకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ ఇందిరను విజయవాడకు పంపారు. డాక్టర్ ఝాన్సీవాణి శనివారం గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతీదేవిని కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు.

సమస్యలు షరా మామూలే !

- నిర్లక్ష్యం నీడలో గుంటూరు ఆర్టీసీ బస్టాండ్
- ఫ్లాట్‌ఫామ్‌లపై తిరగని ఫ్యాన్లు
- మరమ్మతులకు నోచుకోని తాగునీటి కుళాయిలు
- పనిచేయని సీసీ కెమెరాలు
- టాయిలెట్ల వద్ద అధిక వసూళ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- నిర్లక్ష్యంతో పట్టించుకోని అధికారులు



గుంటూరు ఆర్టీసీ బస్టాండ్



ఫ్లాట్ ఫామ్‌పై తిరగని ఫ్యాన్లు

పాత గుంటూరు: ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో ప్రజా రవాణా శాఖ నిర్లక్ష్యం చూపుతోంది. గుంటూరు– 1, 2 డిపోలు, వాటితో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి నిత్యం 80 వేల వరకు వచ్చే ప్రయాణికులతో కిటకిటలాడే గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో పలు సమస్యలు తిష్ట వేశాయి. ప్రయాణికులకు కనీస సదుపాయాలు సమకూర్చడంలో అధికారులు విఫలమవుతున్నారు. సమస్యల్ని పరిష్కరించడంలో నిర్లిప్తత చూపుతున్నారు. ప్రయాణికులు అవస్థలు పడుతున్నా, పరిశీలనకు మాత్రమే పరిమితమవుతున్నారు. బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


సమస్యలు ఇవి...

- తాగునీటి కుళాయిలు మరమ్మతులకు నోచుకోక అశుభ్రంగా ఉంటున్నాయి. వాటి నుంచి వచ్చే నీరు తాగలేక ప్రయాణికులు బస్టాండ్‌లోని శీతల పానీయాల దుకాణాల్లో తాగునీటిని కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకుంటున్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే బస్సులతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే గుంటూరు బస్టాండ్‌లో 08కి పైగా ఫ్లాట్ ఫామ్‌లు ఉండగా, వాటిలో 22 ఫ్యాన్లు తిరగడం లేదు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వేసవి కావడంతో ఎండ వేడిమికి తట్టుకోలేక అల్లాడుతున్నారు.
- ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ప్రయాణికులతో నిత్యం సందడిగా ఉంటుంది. ఇంతటి ముఖ్యమైన బస్టాండ్‌లో భద్రత కరువైంది. తరచూ చోరీలు జరుగుతున్నాయి. సీసీ కెమెరాలు సరిగా లేక నిఘా లోపించింది. రద్దీగా ఉండే 12, 20, 21, 24 ఫ్లాట్ ఫామ్‌లపై చాలా కాలంగా పనిచేయడం లేదు.
- కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లే ప్రయాణికులు మరుగుదొడ్ల నిర్వాహకుల తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ. 5 వసూలు చేయాల్సి ఉండగా రూ. 10 వసూలు చేస్తున్నారు. దీనిపై బస్టాండ్‌లోని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పు ఉండటం లేదు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

బస్టాండ్‌లో ప్రయాణికులు సమస్యల్ని పరిష్కరించే విధంగా చర్యలు చేపడతాం. మరుగుదొడ్ల వినియోగానికి ప్రకటించిన మేరకే ప్రయాణికులు డబ్బులు చెల్లించాలి. అధికంగా అడిగితే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, ఏటీఎం, ఆర్టీసీ బస్టాండ్



20 నంబర్ ఫ్లాట్ ఫామ్‌పై పనిచేయని సీసీ కెమెరా



ఏటీఎం కార్యాలయంలో సీసీ కెమెరాలు పనిచేయక ఖాళీలను సూచిస్తున్న ఎల్ఈడీ టీవీ



వృథా అవుతున్న తాగునీరు

ఉన్నత వర్గాల్లోని పేదలకు రిజర్వేషన్లు వరం

ఎమ్మెల్యే ముస్తఫా



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో ఐదు సంవత్సరాలు రిజర్వేషన్ కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేయడం ఉన్నత వర్గాల పేదలకు వరమని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయని విధంగా ఉన్నత సామాజిక వర్గాల్లోని పేదలకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఐదు సంవత్సరాలు సడలింపు ఇచ్చారని తెలిపారు. ఉద్యోగాల పరంగా అగ్రవర్ణ పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని గుర్తించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. కొద్దిపాటి వయసు తేడాతో ఉద్యోగాలు కోల్పోతున్న అగ్రవర్ణ పేదలకు ఐదు సంవత్సరాల రిజర్వేషన్లు గొప్ప వరమని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నూరి ఫాతిమా, వాకా శ్రీనివాస్ రెడ్డి, ఇత్రి సాయి, సుబ్బులు, నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

నాక్, అకడమిక్ ఎగ్జిబిషన్ విజయవంతం చేయండి

విభాగాధిపతుల సమావేశంలో వీసీ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: యూనివర్సిటీ అధికారులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, కమిటీల సభ్యులు పకడ్బందీగా కృషి చేసి త్వరలో జరగనున్న నాక్, అకడమిక్ ఎగ్జిబిషన్లను విజయవంతం చేయాలని వీసీ పి. రాజశేఖర్ సూచించారు. అకడమిక్ ఎగ్జిబిషన్, నాక్ బృందం సందర్శనకు తీసుకోవాల్సిన చర్యలపై యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, పలు కమిటీల సభ్యులతో శనివారం వీసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నాక్ బృందం పర్యటన సందర్భంగా వారికి సమర్పించే ఎస్ఎస్ఆర్ (సెల్ఫ్ స్టడీ రిపోర్ట్)కు అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాలు త్వరితగతిన సమర్పించాలని సూచించారు. ఎకో– ఎన్విరాన్‌మెంటల్ క్లబ్, లిటరరీ అండ్ కల్చరల్ క్లబ్, ఫోటోగ్రఫీ క్లబ్, ఎలక్ట్రో లిటరసీ క్లబ్‌లతో పాటు పలు అంశాలపై ప్రత్యేకంగా వెంటనే కమిటీలు ఏర్పాటు చేయాలని సంబంధిత విభాగాధిపతులకు సూచించారు. త్వరలో జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు కూడా విజయవంతం చేయాలని సూచించారు. త్వరలో సోషల్ ఎడమిక్ ఆడిట్‌కు కూడా పూర్తి చేస్తామని తెలిపారు. పలు అంశాలపై రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ విభాగాధిపతులకు సూచనలు చేశారు.

మార్చి 15 నుంచి అకడమిక్ ఎగ్జిబిషన్

యూనివర్సిటీ స్థాయి అకడమిక్ ఎగ్జిబిషన్ మార్చి 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కన్వీనర్, సీడీసీ డీన్ కె. మధుబాబు తెలిపారు. సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'గ్లోబల్ సైన్స్ ఫర్ హ్యూమన్ వెల్‌బీయింగ్' అనే అంశంపై అకడమిక్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 400 వరకు ప్రదర్శనలు ఏర్పాటు చేసే లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్నామని, ఏడు కమిటీల్ని కూడా నియమించినట్లు తెలిపారు.

'మరో మహాత్మ' నవల ఆవిష్కరణ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగ అధ్యాపకుడు జి. చెన్నారెడ్డి రచించిన క్యాంపస్ నవల 'మరో మహాత్మ'ను శనివారం వీసీ పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. యూనివర్సిటీలో జరిగిన ఆవిష్కరణలో ఆయన మాట్లాడుతూ గతంలో నవీన్ రాసిన 'అంపశయ్య' క్యాంపస్ నవల తరహాలో మరొక నవలను చెన్నారెడ్డి రాయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో రచయిత జి. చెన్నారెడ్డి, రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించాలి

ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు ఎం.కామేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న కామేశ్వరి

నగరంపాలెం: ప్రజా ఉద్యమాల్లో ఎల్ఐసీ మహిళా ఉద్యోగులు కీలకపాత్ర పోషించాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు ఎం.కామేశ్వరి పిలుపునిచ్చారు. విద్యానగర్ మూడో వీధిలోని ఎల్ఐసీ కార్యాలయంలో మచిలీపట్నం డివిజన్ మహిళా ఉద్యోగుల సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వా విధానాల వల్ల దేశంలో కోట్లాది మంది మహిళల స్థితిగతులు దిగజారుతున్నాయని తెలిపారు. అసమానతలు, ఉపాధి కొరత వంటి సమస్యల తీవ్రత మరింత పెరిగిందని పేర్కొన్నారు. ఏళ్ల తరబడిగా ప్రభుత్వ రంగ ఎల్ఐసీని కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటాల్లో మహిళా ఉద్యోగులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. రానున్న ఉద్యమాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ఎల్ఐసీ మహిళా ఉద్యోగుల రాష్ట్ర కన్వీనర్ జి.సూర్యప్రభ మాట్లాడుతూ అన్ని రంగాల్లో సమానత్వం సాధించడం ద్వారానే దేశ ప్రగతి సాధ్యమని పేర్కొన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల మధ్య సమన్వయం, సహకారం, ఐక్యత అవసరమని సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ కన్వీనర్ కె.భవానీదేవి, ఎల్ఐసీ చీఫ్ మేనేజర్ ఎస్.విజయలక్ష్మి, మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.కిశోర్‌కుమార్, అధ్యక్షుడు జె.సుధాకర్ మాట్లాడారు. 2023–24 సంవత్సరానికి కన్వీనర్‌గా కె.భవానీదేవి, కో– కన్వీనర్లుగా కె.వి.రమణకుమారి, వి.మణికుమారి, ఎస్.సుధారాణి ఎన్నికయ్యారు.

బస్టాండ్‌లో అధిక ధరలపై ఫిర్యాదు

పాత గుంటూరు: గుంటూరు బస్టాండ్‌లోని స్టాల్స్‌లో ఎక్కవ రేట్లను వసూలు చేస్తున్నారని మంగళగిరికి చెందిన శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. గుంటూరు– 2 డిపోలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డిపో మేనేజరు కార్యక్రమంలో డిపో మేనేజరు షేక్ అబ్దుల్ సలామ్ ప్రజల నుంచి ఫోన్ ద్వారా ఫిర్యాదులు, సమస్యలు తెలుసుకున్నారు. గుంటూరు నుంచి విజయవాడ రైల్వే స్టేషన్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని గుంటూరుకు చెందిన రవిచంద్ర ప్రసాద్ కోరారు. నల్లపాడులోని స్కూల్స్ వద్ద ఆర్టీసీ బస్సులు అతి వేగంగా వెళుతున్నాయని, నిదానంగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని నల్లపాడుకు చెందిన సునీతారెడ్డి కోరారు. దివ్యాంగుడైన తన సహాయకుడికి బస్‌పాస్ ఇవ్వాలని కర్లపాలేనికి చెందిన రామలింగేశ్వరరావు కోరారు. పేరేచర్ల నుంచి తెనాలి రూట్‌లో బస్సుల్ని పునరుద్ధరించాలని పలకలూరుకు చెందిన చామర్తి వేంకటేశ్వరరావు విన్నవించారు. ప్రజల సమస్యల్ని పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని డీఎం అబ్దుల్ సలామ్ తెలిపారు.

యువతి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: యువతి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్‌లో నివాసం ఉండే ఓ కుటుంబానికి చెందిన 19 సంవత్సరాల యువతి ఈనెల 24న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబసభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై దాడి

చిన్న వివాదంలో ఇద్దరిపై దాడి చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాగారితోట 2వ లైనులో గుర్రం శ్రీనివాసరెడ్డి, కె.రాంబాబు శనివారం మేడ పై అంతస్తులో నిలబడి ఉన్నారు. ఈ సమయంలో రోడ్డు మీద ఓ యువకుడు బండి మీద నుంచి జారి కిందపడ్డాడు. దాన్ని చూసి శ్రీనివాసరెడ్డి, రాంబాబు నవ్వారు. దీంతో ఆ యువకుడు ఇంటికి వెళ్లి ఐదుగురు మిత్రులతో వచ్చి ఇద్దరిపై దాడి చేసి, వారి వద్ద ఉన్న మూడు సెల్‌ఫోన్లు, బంగారు చైన్ లాక్కొని వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు గాజుల రాజు, షేక్ బషీర్, దాసరి మణికంఠ, సన్ని, గణేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సులో చోరీపై కేసు నమోదు

తోటి ప్రయాణికుడు పాస్‌పోర్టు, లగేజీ బ్యాగును చోరీ చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన జి.ప్రకాష్‌బాబు శుక్రవారం తిరుపతి నుంచి ప్రైవేటు ట్రావెల్స్‌లో విజయవాడకు ప్రయాణించాడు. అయితే, గుంటూరు స్టాప్‌లో తోటి ప్రయాణికుడు ప్రకాష్‌బాబుకు చెందిన రెండు బ్యాగుల్ని చోరీ చేశాడు. బస్సు క్లీనర్ ద్వారా విషయం తెలుసుకున్న ఆయన శనివారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు షేర్ మార్కెట్‌పై అవగాహన సదస్సు

మదనపల్లె : నాగ సతీష్ వెల్త్ బిల్డర్స్ ఆధ్వర్యంలో స్టాక్ మార్కెట్ పెట్టుబడుల అంశంపై ఆదివారం ఉదయం అరండల్‌పేట శివ థియేటర్ పక్కన హోటల్ కార్తికేయ గ్రాండ్‌లో ఉదయం 10, మధ్యాహ్నం 1, సాయంత్రం 4, రాత్రి 7 గంటలకు ఉచిత అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఫైనాన్షియల్ అడ్వైజర్ కృష్ణ కైలాస్ తెలిపారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు, భవిష్యత్తు అవసరాలకు ఇన్వెస్ట్, లాభాలపై ఆర్థిక నిపుణులు వివరిస్తారని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9966610358ను సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతానికి మహిళ బలి

గుంటూరు ఈస్ట్: విద్యుదాఘాతానికి గురై జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. సేకరించిన సమాచారం మేరకు... నల్లచెరువు 22వ లైనులో నివసించే ఎల్.విజయ(40) పాత గుంటూరు మణి హోటల్ సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌లో శనివారం తాపీ పనులు చేస్తోంది. ఓ ప్రాంతంలో శుభ్రం చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురైంది. ప్రమాదంలో శరీరం కాలిపోయింది. స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందింది.

రోడ్ల విస్తరణతో నగరానికి గ్రేటర్ లుక్: మేయర్



శారదా కాలనీ మెయిన్ రోడ్డులో పర్యటిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: రోడ్ల విస్తరణతో నగరానికి గ్రేటర్ లుక్ రానున్నదని, ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కూడా పాలకవర్గం కృషి చేస్తోందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరంలోని సంజీవయ్య నగర్ రైలు గేటు నుంచి రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు చేపట్టిన విస్తరణ పనుల్ని శనివారం స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రధాన రోడ్ల విస్తరణను వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విస్తృతంగా చేపడుతోందని వివరించారు. విస్తరణలో నష్టపోతున్న ప్రతి ఒక్కరికీ పరిహారం అందిస్తుండటంతో ప్రజలు కూడా సహకరిస్తున్నారన్నారు. ఇప్పటికే పెద్ద పలకలూరు, నందివెలుగు, కుగ్లర్ హాస్పిటల్, రామనామ క్షేత్రం, ఏ.టి అగ్రహారం, డొంక రోడ్డు వంటి ప్రధాన రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. సంజీవయ్య నగర్ నుంచి రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్ రోడ్డుకు వెళ్లే రోడ్డును మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగులకు విస్తరణ చేస్తున్నామని తెలిపారు. రెడ్డిపాలెం రోడ్డు విస్తరణ వల్ల నగరంలోని నెహ్రూనగర్, శారదా కాలని, కొత్తపేటలకు వచ్చే వారికి ఉపయోగంగా ఉంటుందని మేయర్ వివరించారు. అనంతరం సంజీవయ్య రైల్వే గేటు వద్ద పైప్‌లైన్ అనుసంధాన పనుల్ని పరిశీలించారు. నగరంలో తాగునీటి సమస్య రాకుండా పనుల్ని వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రజలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, కార్పొరేటర్లు మల్లవరపు రమ్య, ధూపాటి వంశీ, పాపతోటి అంబేడ్కర్, స్థానిక నాయకులు అగ్గిపెట్టి రాజు, మల్లవరపు రవిరాజ, సాల్మన్, పూనూరి నాగేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అత్యంత అరుదైన వ్యాధులకు శస్త్ర చికిత్స



కడుపులో ఉన్న కణితిని తీస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా కేవలం 30 మందికి మాత్రమే వ్యాధి సోకినట్లు మెడికల్ రికార్డ్‌లో నమోదైన అత్యంత అరుదైన వ్యాధి బాధితుడికి ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడినట్లు గుంటూరు ఆదిత్య మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పాకనాటి ప్రవంత్ చెప్పారు. శనివారం గుంటూరులోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన 65 ఏళ్ల వై.శివయ్య ఈనెల 23న తీవ్ర కడుపునొప్పి, లోబీపీతో బాధపడుతూ చికిత్స కోసం తమ ఆసుపత్రికి వచ్చినట్లు చెప్పారు. తక్షణమే అతనికి సిటీస్కాన్, ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఆపరేషన్ చేయాలని నిర్ణయించామన్నారు. ఆపరేషన్ చేసేందుకు పొట్ట ఓపెన్ చేయగానే కడుపులో రెండున్నర లీటర్ల రక్తం కనిపించిందని వెల్లడించారు. పేగులలో వచ్చే రక్త నాళాల సమస్య (మిడిల్ కాలిక్ ఆర్టరీ ఎన్యూరిజం) అనే అరుదైన వ్యాధి సోకినట్లు గుర్తించామన్నారు. తక్షణమే అతనికి సుమారు నాలుగు గంటలసేపు ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో కార్డియో థొరాసిక్, వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ మారుతీ ప్రసాద్ ఇమ్మడిశెట్టి, క్రిటికల్ కేర్ సర్జన్ డాక్టర్ శిరీష్ సంపరలు పాల్గొన్నట్లు వెల్లడించారు.

- గుంటూరుకు చెందిన 53 సంవత్సరాల వాసు కిడ్నీ వద్ద ఎండ్రినల్ గ్రంథికి సోకిన మూడు కేజీల క్యాన్సర్ కణితితో బాధపడుతూ ఈనెల 20న చికిత్స కోసం తమ ఆసుపత్రికి వచ్చారన్నారు. 23న మూత్ర పిండ వ్యాధి నిపుణులు డాక్టర్ రఘుశరత్, క్రిటికల్ కేర్ సర్జన్ డాక్టర్ శిరీష్ సంపర సుమారు మూడు గంటలకుపైగా చేసి కణితిని తొలగించారని చెప్పారు. పది లక్షల మందిలో అతి కొద్ది మందికి మాత్రమే ఇలాంటి సమస్య వస్తుందని డాక్టర్ కృష్ణ ప్రవంత్ తెలిపారు. తమ హాస్పిటల్‌లో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన క్రిటికల్ కేర్ యూనిట్, నిపుణులైన వైద్యులు ఉండటం ద్వారా అరుదైన శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేస్తున్నామని ఆయన వివరించారు.

రాజకీయ అవకాశాలను పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

నెహ్రూనగర్: దళిత బహుజనులు రాజకీయ అవకాశాల్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ సూచించారు. భీమ్ భారత్ ఆధ్వర్యంలో శనివారం దళిత బహుజన రాజకీయ అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా డొక్కా మాణిక్య వరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. దేశ జనాభాలో 95% శాతంగా ఉన్న అణగారిన కులాలైన ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీలు రాజకీయశక్తిగా ఎదగాలని చెప్పారు. దళిత బహుజనుల జీవన విధానంలో కొన్ని మార్పులు రావాలని, ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని ఉన్నతంగా చదివించడం ద్వారా బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేసిన వారమవుతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని, భీమ్ భారత్ నాయకులు జెల్ది మోహన్, దొడ్డా ప్రసాద్, జిల్లా నాయకులు యరగ్రుంట్ల సుజాతారావు, బాజీ, ఉప్పలపాటి ముని, బోరుగడ్డ విల్సన్ రాజ్, నాయకులు పాల్గొన్నారు.

ఐసీఏఐ గుంటూరు శాఖ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గంతో కమిటీ సభ్యులు, సీఏలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని శనివారం అమరావతి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఐసీఏఐ కేంద్ర కమిటీ సభ్యులు డి. ప్రసన్నకుమార్, ముప్పాళ్ల శ్రీధర్, దయానివాస్‌శర్మ, ఎస్ఐఆర్‌సీ చైర్మన్ పన్నారాజ్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్‌గా ఎన్నికైన మద్ది రవితేజ, కార్యదర్శి చింతా వీఎస్ఎస్ రఘునందన్ మాట్లాడుతూ గుంటూరు శాఖ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ఎస్ఐఆర్‌సీ రీజినల్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు, పాస్ట్ చైర్మన్ చిన్న మస్తాన్, గుంటూరు శాఖ వైస్ చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్, కోశాధికారి రుద్రవరపు భరద్వాజ, వీవీ నరేష్, కమిటీ సభ్యులు కె.మృత్యుంజయరావు, వంగల భార్గవి, సీఏలు పాల్గొన్నారు.

దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

నగరంపాలెం (గుంటూరు పశ్చిమ): ఉమ్మడి జిల్లాలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలల్లో శనివారం విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. రీజినల్ ఎస్పీ కేవీ.మాధవరెడ్డి ఆదేశాల మేరకు తనిఖీలు కొనసాగగా, ఎరువులను ఎమ్మార్పీ ధరలకు మించి అదనపు విక్రయాలు, రికార్డుల్లో, స్టాక్‌లో తేడాలను గుర్తించారు. రూ.1,94,350ల విలువైన 14,250 మెట్రిక్ టన్నుల ఎరువులు స్వాధీనం చేసుకున్నారు. రెండు '6 ఎ' కేసులు నమోదు చేశారు. రూ.11,73,367ల విలువైన అనుమతుల్లేని 783 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ తనిఖీల్లో సీఐలు ఎ.శ్రీహరిరావు, టి.లక్ష్మారెడ్డి, వ్యవసాయ అధికారిణి జె.వాసంతి, తహసిల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, సహాయ జియాలజిస్ట్ ఎస్.ప్రసాద్, అటవీ రేంజ్ అధికారి ఓ.సైదులు, ఎస్ఐ ఎం. రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com